# నిర్ణయం

సయ్యద్ జాని భాష

*మొదటి కథ*

'రమ్యకపర్దిని శైలసుతే' అంటూ అమ్మవారి గుడిలోంచి వచ్చే భక్తిపాటలను ఉదయాన్నే ఆరు బయట పడక్కుర్చీలో కూర్చుని శ్రద్ధగా ఆలకిస్తున్న రాఘవయ్య అప్పుడే దినపత్రిక కుర్రాడు గిరాటేసి వెళ్లిన దినపత్రికను చూడడం మొదలు పెట్టాడు. భార్య వసుంధర తులసి మొక్కకు నీళ్లు పోయడంలో నిమగ్నమైంది. రాఘువయ్య ముప్పైఏళ్లకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవలే పదవీ విరమణ చేసాడు. అప్పుడెప్పుడో సర్వీస్‌లో ఉండగా కొన్న బృందావనం కాలనీలోని స్థలంలో ఇల్లు కట్టుకుని స్థిరపడి పోయాడు. కాలనీ వాతావరణం కూడా చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఒకవైపు చిన్న చెరువుగట్టు, మరోవైపు పండ్లతోటలు, ఇంకొకవైపు అమ్మవారి గుడి...ఇలా ప్రకృతి రమణీయతకు నెలవైంది.

* * *

"ఏవండీ! ఆ భీమవరం వాళ్లు మనమ్మాయిని చూసెళ్లారు కదా! ఏమైనా ఉత్తరం రాసారా?" కాఫీ కప్పు రాఘవయ్య చేతిలో పెడుతూ అడిగింది వసుంధర.

"ఆ! రాసారే. మనమ్మాయి వాళ్లకు నచ్చిందట! మనం ఇస్తామన్న కట్నం కూడా నచ్చిందట. కాకపోతే లాంఛనాలు మాత్రం కాస్త ఘనంగా వుండాలంటున్నారు" అంటూ జవాబిచ్చాడు రాఘవయ్య.

"మరి ఎందుకండీ ఇంకా ఆలస్యం? యిప్పటికే చాలా సంబంధాలు చూసాం. అందరికంటే వీళ్లే మనకు అనుకూలంగా వున్నట్లు కనబడుతోంది. పైగా స్థితిమంతులు కూడా. మనమ్మాయికి బాగా జరుగుతుంది. ఆలోచించండి" అంది వసుంధర.

"అవును నువ్వన్నది కూడా నిజమే అంటూ తలూపారు రాఘవయ్య ఏవో విషయాలు దీర్ఘంగా ఆలోచిస్తూ...

* * *

ఎక్స్‌రేలు, పరీక్షల ఫలితాలూ చూస్తూ రాఘవయ్యతో డాక్టరు అన్నాడు "చూడండి రాఘవయ్యగారూ! మీరు ఇప్పటికే చాలా ఆలస్యం

చేసారు. మీరు తొందరగా ఆపరేషన్ చేయించుకుంటేనే ముదరబెట్టిన వ్యాధి తగ్గుతుంది. లేదంటే ముమ్ముందు పరిస్థితి యింకా క్లిష్టంగా వుంటుంది".

డాక్టరుగారు రాసిచ్చిన మందుల చీటీ తీసుకుని త్వరలో వచ్చి కలుస్తానని డాక్టరు వద్ద సెలవు తీసుకుని కదిలాడు రాఘవయ్య. ఆయన రిటైరై ఇప్పటికే సంవత్సరం దాటిపోయింది. వచ్చిన డబ్బులతో ఉండడానికి ఇల్లు కట్టుకుని, కొంత డబ్బు అమ్మాయి పెళ్లి కోసం బ్యాంకులో దాచుకుని, పెన్షన్‌తో సజావుగా జరుపుకుంటూ వస్తున్నాడు.

రాఘవయ్యకు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. సంతానం కొంత ఆలస్యంగా కలిగినందున రిటైరయ్యేనాటికి బాధ్యతలు తీరిపోలేదు. డిగ్రీ వరకు చదివిన అబ్బాయి సుమంత్ చదువు ఆపేసి ఒక కాంట్రాక్టరు దగ్గర గుమస్తాగా చేరి మధ్య మధ్యలో తాను కూడా చిన్న చిన్న కాంట్రాక్టులు చేసుకుంటూ దగ్గర్లోని మరో పట్టణంలో ఉంటున్నాడు.

* * *

"ఎప్పుడు వచ్చావురా!" అంటూ ఇంట్లో అడుగుపెట్టిన రాఘవయ్య కొడుకును పలకరిస్తూ – "కోడలు, పిల్లలు అంతా క్షేమమేనా" అని అడిగాడు.

ఆ... అంతా బాగానే వున్నారు అని జవాబిచ్చాడు సుమంత్. భోజనాల సమయం కావడంతో అందరూ కలిసి భోజనం చేసారు. తరువాత సుమంత్ రాఘవయ్య ప్రక్కన కూర్చొని "నాన్నా!" అని పిలవడంతో తల త్రిప్పి చూసారు రాఘవయ్య.

"ఏంలేదు నాన్నా, ఈ మధ్య నేను చేస్తున్న పంచాయితీరాజ్ కాంట్రాక్ట్‌లో మరో మూడు లక్షల పనులు పూర్తిచేస్తే ఓ పదిలక్షల వరకూ బిల్లు వస్తుంది. ఇప్పుడు నా






దగ్గర డబ్బు లేదు. రెండు మూడు చోట్ల ప్రయత్నం చేసాను. కానీ ఎక్కడా దొరకలేదు. మీ రిటైర్‌మెంట్ డబ్బుల్లో సర్దుబాటు చేస్తే నా బిల్లు రాగానే వీలైతే మీ దగ్గర తీసుకున్న డబ్బుకంటే ఇంకొంచెం ఎక్కువే యిస్తాను. చెల్లెలు పెళ్లి బాధ్యత నాక్కూడా వుంది కాబట్టి నా చేతనైనంత సహకారం నేనూ అందిస్తాను" అంటూ ఆయన ముఖంలోకి చూసాడు.

పూర్తిగా విన్న రాఘవయ్య ఏ జవాబూ చెప్పలేదు..: ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ...

* * *

ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు రాఘవయ్యకు. ఏ నిర్ణయం తీసుకోవాలనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇప్పుడు చేతిలో వున్న డబ్బు కొడుక్కిస్తే రేపు భార్య మాటలువిని వాడు తిరిగి యివ్వకపోతే అమ్మాయి పెళ్లికి ఇబ్బంది పడవలసి వస్తుంది. వాడి బిల్లు కోసం వాడే ఏదో తిప్పలు పడతాడు.

మరోవైపు డాక్టరుగారు చెప్పిన ఆపరేషన్ కోసం వున్న డబ్బు కాస్తా ఖర్చు చేసేస్తే రేపు అమ్మాయి పెళ్లి చేయడం ఇబ్బందవుతుంది. తనకెలాగూ అరవై ఏళ్లు పైబడ్డాయి. ఇంకా వుళ్లు ఏలాలా! ఏమిటి? అమ్మాయి గురించి కొడుకు పట్టించుకుంటాడన్న భరోసా లేదు. మగాడు కాబట్టి ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా వాడి బ్రతుకు వాడు బ్రతుకుతాడు. తానున్నా లేకపోయినా ఫలానా ఆయన కూతురుకు మంచి సంబంధం చెయ్యక ఆ అమ్మాయి ఎన్ని కష్టాలు పడుతోందోనని అందరూ జాలిగా చూస్తారు. కనుక కొడుకు కోపగించుకున్నా, తన జబ్బు ముదిరిపోయినా, తానున్నా, లేకపోయినా అమ్మాయి పెళ్లే ముఖ్యం కాబట్టి ఈ విషయంలో ఇతరత్రా ఆలోచనలు అనవసరం. ఉన్న డబ్బులో ఒక్క రూపాయి కూడా దేనికీ ఖర్చు చేయకూడదని నిర్ణయించుకునేసరికి మనస్సు తేలికపడి మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు రాఘవయ్య. ●